నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు | నంద్యాల

బుధవారం | 19 మార్చి 2025 | పేజీలు 8


# గంజాయి సాగును అరికట్టాలి

➲ కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో గంజాయి సాగు,మత్తు పదార్థాల సరఫరా వినియోగాన్ని పూర్తిగా అరికట్టేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌భాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నార్కోటిక్స్ కో ఆర్డినేషన్(ఎన్‌సిఓఆర్‌డి) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.ముఖ్యంగా యూనివర్సిటీలు, మెడికల్ కళాశాలలు, ఇతర కళాశాలల్లో మిగతా 2లో



- జిల్లా వ్యాప్తంగా తలెత్తిన త్రాగునీటి ఎద్దడి
- పశ్చిమ ప్రాంతంలో పడిపోయిన భూగర్భజలాలు
- మార్చి నెలలోనే మండిపోతున్న భానుడు
- భవిష్యత్తు పై ఆందోళన

# గొంతెండిపోతోంది

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :**

గుక్కెడు మంచినీటి కోసం కోటి కష్టాలు తప్పడం లేదు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం గొంతు తడుపుకునేందుకు అష్ట కష్టాలు పడుతోంది. వారానికో మారు కూడా మంచినీరు సరఫరా కాని గ్రామాలు సింహ భాగం కనిపిస్తున్నాయి. పదిహేను రోజులకొక సారి మంచినీరు సరఫరా అవుతున్న గ్రామాలు కూడా ఉన్నాయి. మంచినీటిని దూర ప్రాంతాల నుండి ట్యాంకర్లతో సరఫరా చేయాల్సిన గ్రామాలూ ఉన్నాయి. కర్నూలు నగరంలో కూడా మంచినీటి సమస్య కనిపి స్తోంది. జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన మంచి నీటి సమస్య కనిపిస్తోంది. వేసవి ఆరంభంలోనే మండిపోతున్న భానుడు రానున్న రోజుల్లో ఎలాంటి పరిస్థితిని సృష్టిస్తాడోనన్న ఆందోళన ప్రజల్లో కనిపిస్తోంది. చాలా గ్రామాల్లో గొంతు తడుపుకునేందుకు నీరిస్తారా? లేక గ్రామాలను ఖాళీ చేసి పొమ్మంటారా? అంటూ ఖాళీ బిందెల తో ఆందోళనలు చేస్తున్న దృశ్యాలు జిల్లా వ్యాప్తంగా కనిపిస్తున్నాయి. 'పానీ'పట్టు యుద్ధాలు కూడా తప్పేట్లుగా లేవు. ఇటీవల జరిగిన జిల్లాపరిషత్ సమావేశంలో ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు మంచినీటి ఎద్దడిని నివారించాలం టూ గగ్గోలు పెట్టిన తీరు సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.

2లో



(ఫైల్‌ఫోటో)



(ఫైల్‌ఫోటో)



త్రాగునీటి కోసం రోడ్డు పై బైఠాయించిన కల్లుదేవకుంట గ్రామస్తులు



(ఫైల్‌ఫోటో)

- త్రాగునీటి కై రోడ్డు పై మహిళలు బైఠాయింపు
- 20 రోజులుగా నీటి సరఫరా బంద్
- ఖాళీ బిందెలతో మహిళలు నిరసన
- వాహనాల రాకపోకలు బంద్
- పంచాయతీ సెక్రెటరీ,ఏఈల పై ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఆగ్రహం

## త్రాగునీటి సమస్యకు

# పరిష్కారం చూపండి..

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామస్థులు తాగునీటి కోసం జాతీయ హైవే రోడ్డుపై మంగళవారం మహిళలు బైఠాయించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు, గ్రామస్థులు మాట్లాడుతూ, మా గ్రామానికి 20రోజుల నుంచి నీటి సరఫరా బంద్ అయ్యిందన్నారు.గ్రామానికి తాగునీరు రావడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ, ఎంపిడిఓ, పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.గుక్కెడు నీటి కోసం 4కి.మీ., దూరంలో ఉన్న మిగతా 2లో



ధర్నా నిర్వహిస్తున్న కల్లుదేవకుంట గ్రామస్థులు

**డోన్, మేజర్‌న్యూస్‌:** అల్లం, నిమ్మకాయ చెరుకు గడల మద్యలోఉంచి, కొద్దిపాటి ఐస్ ముక్కలను వాటికి జోడించి ఒక గ్లాసు మజ్జిగను అలా గొంతులో దిగుతా ఉంటే శరీరంలోని వేడి అలా చల్లబడుతుంటే ఆఆనందంఎన్ని లక్షలు ఇచ్చిన సరిపోదనే చెప్పొచ్చు. మిగతా 2లో



## ధర తక్కువ..

# పోషకాలు ఎక్కువ



# గొంతెండిపోతోంది

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ ప్రాంతంలో ప్రజల గొంతులెండిపోతున్నాయంటూ స్వయంగా కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు ఆందోళన వ్యక్తం చేసిన తీరు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కోడుమూరు, ఆలూరు, పత్తికొండ, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో అడుగడుగునా తీవ్రమైన నీటి ఎద్దడి కనిపిస్తోంది. పశ్చిమ భాగంలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి 68 చెరువులను నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ పనులు పూర్తి కాకపోవడంతో మంచినీటి సమస్యకు ఒక కారణంగా కనిపిస్తోంది. 95 శాతం పనులు పూర్తి అయినట్లు చెబుతున్నా హెచ్ఎన్ఎస్ఎస్ నుండి నీటి మళ్లింపు ఇంత వరకు జరగలేదు. ఇక, గాజులదిన్నె ప్రాజెక్టు ఉన్నా కోడుమూరు పట్టణానికి కూడా మంచినీటి సమస్య తప్పడం లేదు. ఈ నియోజకవర్గంలోని గూడూరు, సి.బెళగల్ మండలాల్లోని పలు గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. హట్టేకల్, పుప్పాలదొడ్డి, బిల్లేకల్లు గ్రామాలు మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. పాణ్యం నియోజకవర్గ పరిధిలో రెండు మండలాలు కర్నూలు జిల్లా పరిధిలోకి వస్తుండగా, రెండు మండలాల్లోని పలు గ్రామాలు మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. కర్నూలు నగర పరిధిలోకి వచ్చే కల్లూరు వార్డుల్లో ఇప్పటికీ రెండు రోజులకో మారు నీరు సరఫరా అవుతోంది. కల్లూరు మండలం యాపర్లపాడు గ్రామంలో తాగునీరు అందక జనం గొంతులు ఎండిపోతున్నాయి. ఉలిందకొండ, తడకనపల్లె, పర్ల, నెరవాడ, ఏ.గోకులపాడు తదితర గ్రామాల్లో మంచినీటిని ట్యాంకర్లతో సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఓర్వకల్లు మండలం తిప్పాయపల్లె, సోమయాజులపల్లె, కొమరోలు, శకునాల తదితర గ్రామాంలోనూ ఇదే పరిస్థితి ఉంది.

జిల్లా పశ్చిమ ప్రాంతంలో కరవుకు చిరునామాగా ఉన్న ఆలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ మంచినీటి కరవు ఛాయలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన ఆలూరులో తీవ్ర నీటి ఎద్దడి నెలకొని ఉంది. వేదవతి నది ప్రవహిస్తున్నా నీటి కోసం కోటి కష్టాలు తప్పడం లేదు. వేదవతి ఎత్తిపోతల పథకానికి గత తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టినా వైకాపా ప్రభుత్వ హయాంలో ఆగిపోయాయి. తాజాగా మళ్లీ తెదేపా ప్రభుత్వమే వచ్చినా వేదవతి పనులు ముందుకు సాగుతాయా? లేదా? అన్న దానిపై స్పష్టత కనిపించడం లేదు. హోళగుంద మండలం గజ్జెహళ్లి గ్రామంలో కేవలం నెల రోజులకు సరపడా నీరు మాత్రమే అందుబాటులో ఉందని, ఆ తర్వాత గ్రామం మొత్తం వలస వెళ్లాల్సిందేనంటూ స్వయంగా నియోజకవర్గ ఎమ్మెల్యే విరూపాక్షి చేసిన ప్రకటన భయం పుట్టించేదిగా ఉంది. ఆస్పరి మండలంలోని 31 గ్రామాల్లోనూ మంచినీటి సమస్య ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఆదోని, కౌతాళం, కోసిగి మండలాల్లోనూ తాగునీటి సమస్య ప్రజలను వేధిస్తోంది.

పశ్చిమ ప్రాంతంలో సాగు, తాగునీటి సమస్య పరిష్కరించేందుకు నీటి వనరులున్నా వినియోగించుకునే ప్రణాళికలు లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. తుంగభద్ర జలాలను పశ్చిమ ప్రాంతానికి పుష్కలంగా అందించే అవకాశం ఉన్నా ఆ వైపుగా చర్యలు లేకపోవడంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ సమస్య ఈ ఏడాదిది ఒక్కటే కాదు. నిరంతర సమస్య గా ఉంది. ప్రతి ఏటా తుంగభద్ర నది నుండి వందలాది టిఎంసిల జలాలు కృష్ణానదిలో కలిసిపోతున్నా అందులో 10శాతం జలాలను కూడా పశ్చిమ ప్రాంతానికి అందించే ప్రాజెక్టులేవీ లేకపోవడం ఈ ప్రాంతానికి శాపంగా కనిపిస్తోంది. రాయలసీమకు గోదావరి జలాలను మళ్లిస్తామంటూ తెదేపా ప్రభు త్వం చెబుతోండగా, గత ప్రభుత్వం రాయలసీమ దుర్భిక్ష నివారణ పథకాన్ని తీసుకువస్తామంటూ గొప్పలు చెప్పిందే తప్ప ప్రస్తుతం రాయలసీమలో దిగువన ఉన్న కర్నూలు జిల్లా సాగు, తాగునీటి సమస్యను ఎలా పరిష్కరిస్తామనది చెప్పుకోలేకపోయాయి. వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి పూర్తి చేయడం, గురురాఘవేంద్ర ప్రాజెక్టును ఉపయోగంలోకి తీసుకురావడం, తుంగభద్ర జలాలను పశ్చిమ ప్రాంతానికి అందించే చిన్నచిన్న ప్రాజెక్టులకు రూపకల్పన చేయడం, గుండ్రేవుల వద్ద కెసి కెనాల్‌కు కేటాయించిన నికర జలాలను నిల్వ చేసుకునేలా రిజర్వాయర్ కట్టడం లాంటి పనులు పూర్తి చేస్తే పశ్చిమ ప్రాంతానికి సాగు, తాగునీటి సమస్య తీరదన్నది అక్షర సత్యం..

# ధర తక్కువ..పోషకాలు ఎక్కువ

(మొదటి పేజీ తరువాయి)

చెరుకురసం పూర్తిగా సహజంగానే స్టాల్స్ ఏర్పాటు చేసుకున్న వారు ఇవ్వడం, కావాల్సినంత చెరుకురసం మన ఎదరుగానే ఎన్నో పోషకాలు, విటమిన్లు ఉన్న దానిని అలా గొంతులోకి వేసుకోగానే శరీరంలోని వేడిని తగ్గించడంతో ప్రజలు చెరుకురసం వైపు పరుగులు లంక్కించుకుంటున్నారు.రాత్రిచలితో..మద్యాహ్నంఎండ వేడితో ప్రజలు అల్లాడిపోతూ, మద్యాహ్నం సమయంలో ఎండ వేడికి ప్రజలు బయటకు రావాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ఆయా వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వచ్చిన ప్రజలకు ఎండ వేడికి అల్లాడిపోతున్నారు. దీంతో చిన్నపాటి చెట్టు నీడ ఉన్న ప్రాంతాలలో చెరుకురసం స్టాల్స్ దగ్గర చెరుకు రసంతో దాహం తీర్చుకోవడానికి ప్రజలు గుమిగూడుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న చెరుకు రసం వైపు ఎండ వేడిని తట్టుకోలేని ప్రజలు పరుగులు తీస్తున్నారు.

**పోషణకు ఆసరాగా నిలుస్తున్న చెరుకురసం :** ఎన్నో రకాల శీతలపానియాలు ఉన్నప్పటికీ ఎండాకాలంలో మాత్రం చెరుకురసానికి ప్రత్యేకమైన స్థానం ఉందనే చెప్పాలి. కంటికి ఎదురుగా చెరుకుగడల నుండి యంత్రం ద్వారా రసాన్ని తీసి తాజాగా రసాన్ని అందించడం, అలాగే చెరుకురసంలో పోషకాలతోపాటు విటమిన్లు అధికంగా ఉండటంతో ప్రజలు సైతం చెరుకురసంపై మక్కువ చూపుతున్నారు. ఇంకా చెప్పాలంటే శరీరంలో వేడిగా ఉన్న సమయంలో మన పెద్దలు కాస్త బెల్లం ఉంటను నోట్లో వేసుకొని చప్పరించాలని, శరీరంలోని వేడికి ఎట్ట తీసుకున్న సమయంలో బెల్లం నీటిని త్రాగాలని చెబుతుంటారు. అలాంటి ఎన్నో పోషకాలు, విటమిన్లు ఉన్న చెరుకురసాన్ని సేవించేందుకు పిల్లలు, పెద్దలతోపాటు వృద్దులు సైతం మక్కువ చూపుతున్నారు. చెరుకురసం ధర కూడా కేవలం ఒక గ్లాసు రూ.10లు ఉండటం దీంతో చెరుకురసం స్టాల్సను, దుకాణాలను ఏర్పాటు చేసుకున్న వారి పోషణకు ఎంతో అసరాగా నిలుస్తుండటం మరో విశేషం.

**ఇంకేమిటీ చదువుతున్నారు..**

**పదండి మనం కూడా మన శరీరంలోని వేడిని తగ్గించుకుందాం..**

# గంజాయి సాగును అరికట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

మత్తు పదార్థాల వినియోగం లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటివి ఏవైనా జరుగుతుంటే దాచి పెట్టవద్దని, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు,టోల్ ఫ్రీ నెంబర్ వివరాలతో శాశ్వతంగా ఉండే విధంగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ డిఈఓను ఆదేశించారు. పొలాల్లో గంజాయి సాగు గురించి వ్యవసాయ శాఖ అధికారులతో పాటు విఆర్ఓల ద్వారా సమాచారం తీసుకుని పోలీస్ శాఖకు అందించాలని ఆదోని సబ్ కలెక్టర్,ఆర్డీఓలను ఆదేశించారు. ఎక్సైజ్,అటవీ శాఖల అధికారులు కూడా గంజాయి సాగు,మత్తు పదార్థాల వినియోగం పట్ల నిఘా ఉంచాలన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుండి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పాఠశాలల్లో వ్యాసరచన,వకృత్వ పోటీలు,ర్యాలీలు, ప్రతిజ్ఞల ద్వారా విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని డిఈఓను ఆదేశించారు. మిరప పంట మధ్యలో గంజాయి సాగు చేసే అవకాశం ఉన్నందున వ్యవసాయ శాఖ వారు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు గంజాయి సాగు చట్టపరంగా నేరం అనే విషయం పూర్తిగా అర్థమయ్యేలా వివరించాలని వ్యవసాయ శాఖ అధికారికి సూచించారు. నగరంలో ఉన్న వార్డు సెక్రటేరియట్‌లు వచ్చే ఫిర్యాదులను పోలీస్ శాఖకు అందించేలా అడ్మిన్ సెక్రటరీకి తగిన ఆదేశాలు జారీ చేయాలని కమీషనర్‌ను ఆదేశించారు. బస్సులు,రైళ్ల ద్వారా వీటి రవాణాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డ్రైవర్లు, కండెక్టర్లకు అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాల వినియోగానికి పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి,జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్,ఆర్టీసి ఆర్ఎం శ్రీనివాసులు, అదనపు మున్సిపల్ కమీషనర్ ఆర్‌జివి కృష్ణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక పాదయాత్ర భక్తులు కోసిగికి చేరిక

**– కోసిగిలో మారుమ్రోగుతున్న మల్లయ్య నామస్మరణం – భక్తులకు అన్నదానం**




**అన్నదానం తిని సేదతీరుతున్న భక్తులు**

**కోసిగి మేజర్ న్యూస్:** కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన శ్రీశైల భక్తుల పాదయాత్ర కోసిగికి చేరుకోవడం జరిగింది. ఈ భక్తులరాక రెండురోజులుగా భక్తులతో కోసిగి కళకళలాడుతుంది. అలాగే శ్రీశైల మల్లన్నస్వామి..ఓ మల్లన్న, ఓం నమ:శివాయ.. అంటూ నామస్మరణచేయడంతో కోసిగిలో శివనామస్మరణంతో మారుమ్రోగిపోతుంది. అలాగే తప్పిళ్ళు, భజన, కాళ్ళకు కట్టెలు వంటివాటితో పాదయాత్ర చేపడుతూనే ఉన్నారు. పాదయాత్ర చేపట్టిన భక్తులకు కోల్‌మాన్‌పేట, దుద్ది, కోసిగి లోని దొర్లజిన్నా, సాయి ఫోటోస్టుడియో, దొడ్డిబెళగల్ వంటి ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే వైకాపా నాయకులు బండ్లగోవిందు భక్తులకు మజ్జిగను పంపిణీచేశారు.

# పెద్దదేవలాపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం




**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని పెద్దదేవలాపురం, భోజనం గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారిణి స్వాతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిణి స్వాతి మాట్లాడుతూ ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. వాటిపై అభ్యంతరాలు ఉన్నరైతులు ఈ నెల 22 లోగా స్థానిక రైతు సేవా కేంద్రంలో గ్రీవెన్స్ కొరకు ధరఖాస్తు చేసుకుని మార్చుకోగలరని తెలిపారు. అలాగే వ్యవసాయ యంత్రాల సబ్సిడి రైతు సేవా కేంద్రం ద్వారా 50 శాతంతో రైతులకు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని తెలిపారు.రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకురాలు సుహాసిని, రైతులు డిష్ రామలింగం, అడ్డాకుల సురేష్, పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్యకు పరిష్కారం చూపండి..

(మొదటి పేజీ తరువాయి)

చిలకలడోన, ఇబ్రహీంపురం గ్రామాలకెళ్ళి నీటిని తీసుకురావడానికి కష్టాలు పడుతున్నామన్నారు. అందుకే మంగళవారం మహిళలు, యువకులు, పెద్దలు కలిసి జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన తెలపడంతో దాదాపు రెండు కి.మీ., వరకు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంత్రాలయం తహశీల్దార్ రవి అక్కడికి చేరుకొని సమాచారాన్ని ఫోన్ ద్వారా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు తెలిపారు. సిఐ రామాంజులు, ఎస్.ఐ శివాంజల్, తహశీల్దార్ రవి గ్రామస్థులకు ఆందోళన విరమించాలని సర్ధిచెప్పిన సమస్యను పరిష్కరించేవరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని మహిళలు తేల్చి చెప్పారు. తాగునీటికి సంబంధించిన అధికారులు ఇక్కడకు వచ్చి హామీ ఇవ్వాలని పట్టు పట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ వెంకటరాముడుకు అక్కడ



**గ్రామస్థులతో మాట్లాడుతున్న తహశీల్దార్, సిఐ**

ఉన్న అధికారులు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న ఎఈ తాగునీటి శాశ్వత పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ సర్పంచు కూడ గ్రామంలో నీటి ఏద్దడి ఉన్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఈ మాట్లాడుతూ, 40 సంవత్సరాల క్రితం పైపులైన్ వే శారని, పైపులు లీకేజీ కావడం వలన తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని తాత్కాలికంగా సరఫరా చేస్తామన్నారు. గ్రామస్థులు ట్యాంకర్లతో నీటిని సప్లయ్ చేయవద్దని, ఆ నీటి కోసం గొడవలకు దిగి ఘర్షణలు చోటు చేసుకొని కేసు నమోదు చేసుకున్నారన్నారు. తహశీల్దార్ ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించగా, హుటాహుటీనా ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ పద్మజ ఘటన స్థలానికి చేరుకొని గ్రామస్థులతో నీటి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. మంత్రాలయం ఎన్‌ఏపి స్కీం కాంట్రా క్టర్, సర్పంచ్ భీమన్నను ఘటన స్థలానికి చేరుకొని తాగునీటి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఎందుకోసం ఇలా జరుగుతుందని ఈఈ కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. అనంతరం పంచాయతీ సెక్రటరీ మహేష్,, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ ఆసహానం




**సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ**

వ్యక్తం చేశారు. 20రోజులుగా నీటి సమస్య ఉన్నా, ఎందుకు పట్టించుకోవడం లేదని వారిని ప్రశ్నిం చారు. ఇలాంటి చర్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ గ్రామానికి శాశ్వత నీటి సమస్య కోసం మండల నిధులు ఉపయోగించుకొని పరిష్కరిస్తామని హామీ తెలపడంతో ఆందోళన విరమింప చేశారు.

# ఎమ్మిగనూరు - కంబలదిన్నె రోడ్డు వెయ్యాలి

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ఎమ్మిగనూరు నుండి కోసిగి వెళ్లే రహదారి అధ్వాన్నంగా తయారు అయిన నేపద్యంలో రోడ్డు , భవనాల శాఖ అధికారులు ప్రజ లు ఎదుర్కోంటున్న కష్టాలను పరిగణలోకి తీసుకుని రోడ్డును వెయ్యాలని ఆర్‌ఏవివిఫ్ విద్యార్థి సంఘం నాయకులు ఖాజా రోడ్డు భవనాలు శాఖ ఎస్‌ఈ సిద్ధారెడ్డిని కలిసి మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు నుండి కంబలదిన్నె వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్న నేపద్యంలో బస్సులతో పాటు వాహనాలు ప్రమాదాలకు గురి అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. పరీక్షల వేల సమయానికి పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోలేకపోతున్నా రన్నారు. ఇక రైతుల పంటలు



ఎస్‌ఈ కి విన్నవించుకుంటున్న విద్యార్థిసంఘం నాయకులు

అమ్మకాలకు తీసుకెళ్లాలన్నా రోడ్డు అధ్వాన్న దుస్థితి నేపద్యంలో అష్టకష్టాల పాలు అవుతున్నారన్నారు. ఇక ఎమ్మిగనూరు వైద్యశాలకు రావాలంటే గర్భవతులు ఎక్కడ ప్రాణాలు హరిమంటాయో అనే యోచనలో ఆందోళనకూడిన పయణం చేస్తున్నారన్నారు. ఇలా వర్షాకాలంలో అయితే ప్రయాణం అతి ప్రమాదాలకు దారి తీస్తుందని ఆరోజుల్లో గమ్యస్థానం చేర్చాలేక ఆగమ్య గోచారంగా ఉన్న రోడ్డు కారణంగా ప్రమాదాలనుండి కాపాడాలని ఆయనకు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. వినతులు తీసుకున్న ఎస్‌ఈ సిద్దారెడ్డి తొందరలో టెండర్లు పిలువనున్నట్టు వెల్లడించడం జరిగిందన్నారు. అయితే ఆ అధికారి సింగిల్ రోడ్డుకు మాత్రమే టెండర్ లు ఉండచ్చు అని తెలపడంతో ఉరుకుంద, మంత్రాలయం పుణ్యక్షేత్ర భక్తులను , రవాణా వాహనాల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని మాలపల్లి వరకు ఉన్న డబుల్ రోడ్డులానే కంబలదిన్నె - ఎమ్మిగనూరు వరకు కలపాలని కోరడం జరిగిందన్నారు.

# శ్రీరామకృష్ణ కళాశాలలో జాతీయస్థాయి ఐటి మీట్





మాట్లాడుతున్న ఉపకులపతి ప్రొఫెసర్ వెంకటబసవరావు

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :**నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో మంగళవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ ఆధ్వర్యంలో కెమరూన్ 2కె 25 పేరుతో జాతీయస్థాయి ఐటీ మీట్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రాయలసీమ యూనివర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ వెంకట బసవరావు, కార్యదర్శి విజయకుమారి, ప్రిన్సిపల్ సుబ్బయ్య, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్స్ ప్రగతిరెడ్డి, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్స్ డాక్టర్ కుమార్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఉపకులపతి వెంకట బసవరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశం అని ప్రతిభను, మీ ఆలోచన చూపించుకోవడానికి ఇది ఒక మంచి వేదికగా ఉపయోగపడుతుందన్నారు. మీకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పుడు ఎక్కువగా అభివృద్ధిలో ఉన్న టెక్నాలజీ, నైపుణ్యాల గురించి తెలుసుకోవచ్చన్నారు. మీ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ఇది ఎంతో చక్కగా ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంతో బిజీగా ఉన్నప్పటికీ ఉపకులపతి రావడం సంతోషించదగ్గ విషయం అన్నారు. కళబూశాలలు ఇంకా అభివృద్ధి కావాలని కోరుకుంటున్నాం అన్నారు. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. ప్రిన్సిపల్ సుబ్బయ్య మాట్లాడుతూ కెమరూన్ ఫెస్ట్‌ని మన కళాశాలలో మనము ఎన్నో సంవత్సరాల నుంచి జరుపుకుంటున్నామన్నారు. ఇది విద్యార్థులకు ఒక మంచి అవకాశం, ఒక మంచి వేదికగా ఉపయోగపడుతుందన్నారు. మీకు వచ్చిన ఈ అవకాశాన్ని మీరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు.

## పన్నులు చెల్లించకపోతే
# దుకాణాలు సీజ్
### - నగరపాలక అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ




**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థకు సంబంధించి ఆస్తి పన్ను,కొళాయి చార్జీలు,ట్రేడ్ లైసెన్సు రుసుములను త్వరితగతిన చెల్లించకపోతే వాణిజ్య సముదాయాల దుకాణాలను సీజ్ చేస్తామని, గృహాలకు తాగునీటి కొళాయి కనెక్షన్లు కట్ చేస్తామని నగరపాలక అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ గృహ,వాణిజ్య దుకాణాల యజమానులను హెచ్చరించారు. మంగళవారం చెన్నమ్మ సర్కిల్ సమీపంలోని శ్రీ చక్ర హాస్పిటల్ నగరపాలకకు రూ.6.58లక్షల ఆస్తి పన్ను బకాయిలు చెల్లించేందుకు జాప్యం చేస్తుండడంతో అదనపు కమీషనర్ ఆద్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఆసుపత్రిలో బ్యానర్లు,ప్లకార్డులతో శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఆస్తి,వ్యాపార వాణిజ్య దుకాణాలు, సముదాయాలు కలిగిన ప్రతి పౌరుడు నగరపాలకకు సకాలంలో బాధ్యతాయుతంగా పన్నులు చెల్లించాలని ఇందులో నిర్లక్ష్యం ప్రదర్శించడం తగదన్నారు. పన్నుల రూపంలో వచ్చిన నిధులతోనే నగరంలో మౌలిక వసతులను కల్పించడం సాధ్యమవుతుందన్నారు. పన్నులను జాప్యం చేయకుండ,సత్వరమే పన్నులను చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ జునైద్,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు జిఎం శ్రీకాంత్,సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

## ఉమర్ అరబిక్ పాఠశాలను కాపాడుకుంటాం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** ఉమర్ అరబిక్ పాఠశాలను కాపాడు కుంటామని ముస్లిం మైనార్టీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ సలీం మాలిక్ అన్నారు. మంగళవారం నగరంలోని ఉమర్ అరబిక్ పాఠశాలను పరిరక్షించాలని పూర్వ విద్యార్థులు,ఆవాజ్ కమిటీ ప్రతి



నిధులు, విద్యార్థి సంఘాల ఆద్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వందేళ్ల చరిత్ర ఉన్న ఉమర్ అరబిక్ పాఠశాలను ప్రైవేటు వ్యక్తులకు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతుందని పాఠశాలను ప్రైవేటు పరం చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ఉమర్ అరబిక్ పాఠశాలను కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా పోరాటం చేస్తుంటే కొందరు తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని చెప్పడం సరికాదన్నారు. తను కేవలం ముస్లిం మైనార్టీలకు సంబంధించి ఏదైనా అన్యాయం జరిగితే రాజకీయాలకు సంబంధం లేకుండా పోరాటం చేస్తామని తెలిపారు. గతంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తెదేపా నేత షరీఫ్‌ను అసభ్యంగా మాట్లాడితే ఖండిచామన్నారు. అభివృద్ధి కోసం నారా లోకేష్‌ను సైతం కలిసినట్లు ఆయన ఫోటోలు చూపారు. ఉమర్ అరబిక్ పాఠశాలపై అంజుమెన్ కమిటీ సభ్యులు స్పష్టత ఇవ్వడం లేదన్నారు. పాఠశాలలో ఇంగ్లీష్‌ను ప్రవేశపెట్టి ఉర్దూ భాషను కొనసాగించాలన్నారు. విద్యార్థులకు ఉచితంగానే విద్యను చెప్పాలన్నారు.

## ఆహార నాణ్యత ప్రమాణాలపై కమీషనర్ ఆరా



క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న కమీషనర్

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** నగరంలోని అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యత ప్రమాణాలపై నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు ప్రజలను ఆరాతీశారు. మంగళవారం పాత బస్తీలోని అన్న క్యాంటీన్లను కమీషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అల్పాహారం చేయడానికి వచ్చిన ప్రజలను కమీషనర్ ఆప్యాయంగా పలకరించి అల్పాహార రుచిని అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ల వద్ద సమయం కన్నా ముందే స్వచ్చత పనులు చేపట్టాలని, ఆహార నాణ్యత విషయంలో రాజీ పడొద్దని కమీషనర్ నిర్వాహకులకు సూచించారు. తప్పనిసరిగా మెనూ పాటించాలన్నారు.

## టోపి మారెమ్మ అవ్వ దేవాలయంలో హుండీ చోరి



టోపి మారెమ్మ అవ్వ గుడి దగ్గర పరిశీలన చేస్తున్న ఎస్సై

**హాలహర్వి, మేజర్ న్యూస్ :** హాలహర్వి మండలంలోని అమృతాపురం గ్రామ సమీపంలో వెలసిన టోపి మారెమ్మ అవ్వ దేవాలయం లో గుర్తు తెలియని దుండగులు హుండీ ని దొంగలించి అందులో ఉన్న నగదు తీసుకొని హుండీ ని పగలగొట్టి వెళ్లినట్లు ఎస్సై చంద్ర తెలిపారు. విషయం తెలుసుకున్న సిఐ రవిశంకర్ రెడ్డి కర్నూలు నుండి క్లూస్ టీమ్ ను పిలిపించి దేవాలయంలో సిసి కెమెరాలను,గూళ్యం వైన్ షాప్ లో సిసి కెమెరాలను పరిశీలించారు. దుండగలు ఇద్దరు మద్యం సేవించి హుండీ ని పగలగొట్టినట్లు తెలుస్తుందని నిందితుల చిత్రాల ద్వారా గుర్తించి వారిపై కేసు నమోదు చేస్తామని అన్నారు.దేవాలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని అన్నారు.కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి రైతు రైతు సంఘములో చేరండి



**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** బేతంచెర్ల మండల పరిధిలోని ప్రతి రైతు రైతు సంఘములో సభ్యత్వం తీసుకోవాలని ఏపీ రైతు సంఘము రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి కోరారు. మంగళవారం మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో ఏపీ రైతుసంఘం మండల కార్యదర్శి పి. రామ మోహన్ ఆధ్వర్యంలో ఎపి. రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది .ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతు సంఘం ఏర్పాటు చేయాలని పిలుపు నిచ్చారు. సమస్యల పరిష్కారానికి రైతు సంఘాన్ని మరింత బలపరుచుకోవాలని, రైతులందరూ రాజకీయాలకు అతీతంగా ఐక్యం కావాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర వ్యాపితంగా రైతాంగ సమస్యలపై శక్తి మేరకు కృషి చేస్తుందని గిట్టుబాటు ధరలపై, కనీస మద్దతు ధరలపై,పాలక ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తున్నామని అన్నారు. పాలక ప్రభాత్వాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలనన్నింటిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు,కౌలురైతులు, వ్యవసాయకార్మికులు ఐక్యమై పోరాటాలు చేసి సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలోఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజ శేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు వి. సుబ్బరాయుడు, మండల నాయకులు రహంతుల్లా,కిష్టన్న, మధు,రామలక్ష్మి, ఎల్ల కృష్ణ, వెంకట సుబ్బయ్య అంబాపురం రైతులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిర్మించిన దుకాణాలను తొలగించే వరకు మా పోరాటం ఆపేది లేదు
### - కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ

**ఆదోని, మేజర్‌న్యూస్ :** ఆదోని మున్సిపాలిటీ 35వ వార్డు అమరావతి నగర్ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా మున్సిపాలిటీ స్థలంలో కొంతమంది అక్రమంగా షెడ్లు వేసి బాడుగలకు ఇచ్చుకొని అక్రమ సంపాదనకు తె రలేపారని అమరావతి నగర్ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, రోడ్డుపైన అక్రమంగా షెడ్లు వేసి పేదల ముక్కుపిండి బాడుగలు వసూలు చేసుకుంటున్నారని, అలా కాకుండా షెడ్లను మున్సిపాలిటీ వారు స్వాధీనం చేసుకొని నామమాత్రపు బాడుగ కట్టించుకోవాలని లలితమ్మ మున్సిపల్ కమీషనర్‌ను కోరారు. కమీషనర్ వెంటనే స్పందించి తప్పకుండా షెడ్లను తొలగించడమా లేక స్వాధీనం చేసుకోవడమా అనేది పరిశీలన చేసి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కమీషనర్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. ఇందుకు మున్సిపల్ కమీషనర్‌కు కౌన్సిలర్ కృతజ్ఞతలు తెలిపారు.



సూర్య



# మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మతో లబ్ధి పొంది విమర్శలా..?

- ప్రస్తుత ఎమ్మెల్యేతో మెప్పు కోసమే కొంతమంది నాయకులు మాజీ ఎమ్మెల్యేపై విమర్శలు
- చెరువులలో జరిగిన అభివృద్ధి ప్రత్యక్షంగా కనబడుతున్నా.. అవినీతి అంటారా..?
- టమోటా ప్రాసెసింగ్ యూనిట్ వైకాపా ప్రభుత్వంలో మంజూరైంది
- వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్ యాదవ్



జిల్లా నాగేష్ యాదవ్,వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు

**తుగ్గలి, మేజర్‌న్యూస్ :** మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మతో ఎంతో లబ్ధి పొందిన వారు నేడు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మపై విమర్శలు చేస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్ యాదవ్ అన్నారు. మంగళవారం జి ఎర్రగుడి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిట్టా నాగేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం మాట్లాడుతున్న కొంతమంది తెలుగుదేశం నాయకులు గతంలో అప్పటి ఎమ్మెల్యే శ్రీదేవమ్మ నుండి లబ్ధి పొందిన విషయం జిల్లా ప్రజలందరికి తెలుసని అలాంటి నాయకులు నేడు వన్‌టైం సెటిల్‌మెంట్ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ అని ప్రతికలలో ప్రకటనలు ఇవ్వడం కెఈ శ్యాం కుమార్ శాశ్వత ఎమ్మెల్యే అని పేర్కొనడం సరికాదన్నారు. ఎవరైనా సరే ఎమ్మెల్యే కావాలంటే ప్రజల సహకారం అవసరమన్న విషయాన్ని టిడిపి నాయకులు గమనించాలన్నారు. పత్తికొండ నియోజకవర్గంలోని పలు చెరువులలో రూ.36కోట్లతో చేసిన అభివృద్ధి పనులు ప్రత్యక్షంగా కనబడుతున్నా వాటికి ఇంతవరకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా బిల్లులు ఇవ్వకపోయినప్పటికీ రూ.36కోట్ల అవినీతి జరిగిందని ఎమ్మెల్యే కెఈ శ్యాం కుమార్ అసెంబ్లీలో మాట్లాడుతుంటే రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. టమోటా సాగు చేసే రైతులందరికి ఉపయోగపడే విధంగా టమోటా మార్కెట్‌కు దగ్గరైన హోసూరు వద్ద అప్పటి ఎమ్మెల్యే శ్రీదేవమ్మ టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు భూమిపూజ చేసి నిధులు కూడా మంజూరు చేయించడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే కెఈ శ్యాంకుమార్ అక్కడ నుండి స్థలాన్ని మార్చి వేరే చోట నిర్మించేందుకు భూమి పూజ చేసి మేమే టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు నిధులు మంజూరు చేయించామని చెప్పుకోవడం హాస్యాస్పదమని ఎద్దేవ చేశారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండ వాటిని ప్రజలు మరిచిపోయే విధంగా ఇలాంటి ప్రకటనలు టిడిపి నాయకులు చేస్తున్నారని మండిపడ్డారు. తెదేపా నాయకులకు చేతనైతే మీ 9నెలల పాలనలో ప్రజలకు ఒక్క పథకమైనా ఇచ్చారా అని అది ప్రజలకు బహిరంగంగా తెలియజేయాలని ఆయన సవాల్ విసిరారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు ఇలాంటి ఆరోపణలు చేయకుండ నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడితే తామంతా సహకరిస్తామని ఆయన అన్నారు.

## పన్నుల వసూళ్లకు అదనపు కౌంటర్



**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** నగరపాలక కార్యాలయంలో ఆస్తి పన్ను,తాగునీటి కొళాయి చార్జీలు,ట్రేడ్ లైసెన్స్ రుసుముల చెల్లింపునకు పన్ను వసూళ్ల కేంద్రం వద్ద జనతాకిడి రోజురోజుకు పెరుగుతూ వస్తుండడంతో అదనపు కౌంటర్ ఏర్పాటు చేసినట్లు నగరపాలక కార్యాలయ మేనేజర్ చిన్న రాముడు తెలిపారు. మంగళవారం అదనపు కౌంటర్‌ను మేనేజర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారులు నిరీక్షించకుండ త్వరగా పన్నులు చెల్లించేందుకు వీలుగా అదనపు కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. నగర ప్రజలు నగరపాలక కార్యాలయంలో కాకుండ సంబంధిత సచివాలయం, ఆన్‌లైన్‌లో సైతం ఆస్తి పన్ను,తాగునీటి చార్జీలను చెల్లించవచ్చున్నారు. ఆర్ఐ భార్గవ్,సిబ్బంది వినోద్,తారక్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదులకు కొనసాగిన శిక్షణ




**కల్లూరు,మేజర్‌న్యూస్ :** నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయ సేవా సదన్‌లో న్యాయవాదులకు శిక్షణ తరగతులు రెండోరోజు మంగళవారం కొనసాగాయి. జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు,జిల్లా జడ్జి కబర్థి, కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో కేరళ నుండి వచ్చిన మధ్యవర్తిత్వం శిక్షణ సిబ్బంది సురేష్ పిజి, జ్యోతి గోపినాథన్‌లు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల న్యాయవాదులు, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.

## తాటిపాడు ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి..
# కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి



ఎంపీడీవో గోపీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

**జూపాడుబంగ్లా,మేజర్‌న్యూస్:** తాటిపాడు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉన్న చిన్న లింగన్నను తొలగించి కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని తాటిపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, యాదవ్ కార్పోరేషన్ స్టేట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గిరీశ్వం రెడ్డిలు మంగళవారం ఎంపీడీవో గోపీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ తాటిపాడు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న చిన్న లింగన్న గతంలోనే రెండు, మూడు సార్లు సస్పెండ్ అయి విధుల నుంచి తొలగించినా మళ్లీ అతనినే ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు కొనసాగించడం సబబు కాదని ఆయన అన్నారు. అతడు చేసిన అవినీతిపై గ్రామ సర్పంచ్ లక్ష్మిదేవమ్మ, ఉపాధి కూలీలు అనేక మార్లు స్పందన కార్యక్రమంలో అతనిపై ఫిర్యాదు చేయడం జరిగిందని, అయినప్పటికీ రాజకీయ బలంతో అతనినే ఫీల్డ్ అసిస్టెంట్‌గా కొనసాగించడం ఇంతకన్నా అన్యాయం ఏమైనా ఉందని ఆయన ప్రశ్నించారు. ఫీల్డ్ అసిస్టెంట్ చిన్న లింగన్నను ఇటీవలనే జనవరి 7వ తేదీ 2025న ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా కలెక్టర్ సస్పెండ్ కూడా చేశారని, అయినా మళ్లీ అతనినే ఫీల్డ్ అసిస్టెంట్‌గా కొనసాగించేందుకు అనుమతులు తెచ్చుకొన్నాడు. అయినా అతనిని తాటిపాడు ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించడానికి అర్హుడు కాదు, పనికి రాడని, చిన్న లింగన్నను విధులను తొలగించి కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని గ్రామ సర్పంచ్ లక్ష్మిదేవమ్మ, గ్రామ ప్రజలు తీర్మాణంతో చేసిన వినతిపత్రాన్ని ఎంపీడీవోకు అందజేయడం జరిగిందని ఆయన అన్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాటిపాడు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు



ఆపరేషన్ల కోసం కర్నూలుకు వెళ్తున్న పేషెంట్లు

**తుగ్గలి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని పగిడిరాయి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రి వైద్యులచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 75మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యులు 34మందికి కంటి ఆపరేషన్లు చేయాలని గుర్తించారు. వీరందరికి ఆపరేషన్లు చేసేందుకు కర్నూలు కంటి ప్రాంతీయ వైద్యశాలకు బస్సులో తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్ మొలజిస్ట్ డాక్టర్ నిఖిత, స్థానిక వైద్యులు డాక్టర్ హరిత,ఆప్తాలిక అసిస్టెంట్ హనుమంతరెడ్డి, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో 11 మంది ఎస్ఐల బదిలీలు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** పరిపాలనలో భాగంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ 11మంది ఎస్ఐలను మంగళవారం బదిలీ చేశారు. బదిలీ అయిన వారు విఆర్ ఎస్పీ కర్నూలులో పనిచేస్తున్న ఎస్ఐ జి హనుమంతరెడ్డిని కోసిగి పిఎస్‌కు, హొళగుంద పిఎస్‌లో పనిచేస్తున్న ఎస్ బాల నరసింహులును కర్నూలు త్రీటౌన్‌కు,కోసిగి పిఎస్‌లో పనిచేస్తున్న చంద్రమోహన్‌ను కర్నూలు త్రీటౌన్‌కు, కొత్తపల్లి పిఎస్‌లో పనిచేస్తున్న ఎం కేశవ్‌ను నందవరం పిఎస్‌కు, నందవరం పిఎస్‌లో పనిచేస్తున్న వి శ్రీనివాసులును డిసిఆర్‌బి కర్నూలుకు, విఆర్ ఎస్పీలో పనిచేస్తున్న ఎ రమేష్‌బాబును కర్నూలు వన్‌టౌన్‌కు, కర్నూలు త్రీ టౌన్‌లో పనిచేస్తున్న జె మన్మథవిజయ్‌ని విఆర్ కర్నూలు,అటాచ్డ్ ఆస్పరి పిఎస్, డిసిఆర్‌బి కర్నూలులో పనిచేస్తున్న ఎన్‌సి మల్లికార్జున జొన్నగిరి పిఎస్‌కు,జొన్నగిరి పిఎస్‌లో పనిచేస్తున్న ఆర్ జయశేఖర్‌ను ఆదోని త్రీటౌన్ పిఎస్‌కు, కర్నూలు డిఎస్‌బిలో పనిచేస్తున్న మహబూబ్‌భాషాను ఆలూరు పిఎస్‌కు, ఆలూరు పిఎస్‌లో పనిచేస్తున్న జి దిలీప్‌కుమార్‌ను హొళగుంద పిఎస్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే తమకు కేటాయించిన పోలీస్‌స్టేషన్‌లో హాజరై తమ విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

## ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**మహానంది, మేజర్‌న్యూస్ :** 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లోని ఎంపిసి, బైపిసి, సిఈసి, ఎంఈసి విభాగాల్లో ప్రతి విభాగానికి 40 సీట్లు చొప్పున ఉన్నాయని ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతి లో సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఓసి, బిసి, ఈడబ్ల్యూఎస్ విద్యార్థు లు రూ.200లు, ఎస్టీ, ఎస్సీ విద్యార్థులు రూ.150లు చెల్లించి ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి మే నెల 22వ తేదీ వరకు గడువు.

## నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫా



రంజాన్ తోఫాను అందచేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

**కర్నూలు రూరల్, మేజర్ న్యూస్ :** నగరం లోని జొహరాపురం 18వ వార్డు లో అస్లాం భాష ఆధ్వర్యం లో మంగళవారం నిరుపేద ముస్లిం సోదరులకు రూ.10లక్షలతో 1500 మందికి రంజాన్ తోఫా కిట్లను టిడిపి సీనియర్ నాయకులు డి విష్ణువర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అస్లాం భాష ఉన్నతంగా ఆలోచించి నిరుపేదలకు సహాయం చేయడం చాలా మంచి ఆలోచన అన్నారు. ప్రతి ఏడాది పండుగ సందర్భంగా పండుగ సరుకులు అందిస్తారన్నారు. అలాగే మరికొందరు నగదు రూపంలో కూడా అందిస్తారని తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ పవిత్ర మాసంలో ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉంటారన్నారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్,మహమ్మద్, ఇషాక్,మున్నా,షఫీ,రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ కార్యదర్శులకు ప్రమోషన్లు

**తుగ్గలి, మేజర్‌న్యూస్ :** మండలంలోని రాతన, ఎద్దులదొడ్డి, రాంపల్లి, ఎర్రగుడి గ్రామ సచివాలయాల్లో హెల్త్ కార్యదర్శులుగా పనిచేస్తున్న శ్రీదేవి, దీప, రోజా, సుజాతలకు మంగళవారం ఎంపిహెచ్ఏ(ఎఫ్)గా ప్రమోషన్లు కల్పిస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో దీప ఆర్ఎస్ పెండేకల్ సబ్ సెంటర్‌కు, రోజా మారెళ్లకు, శ్రీదేవి హొళగుందకు, సుజాత కొలిమిగుండ్ల సబ్ సెంటర్లకు బదిలీ చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

## పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఓర్వకల్లు మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల బాలురు, కాల్వబుగ్గ ఏపి రెసిడెన్షియల్ స్కూల్ మరియు ఏపి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ ప్రవేశాల కొరకు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని కాల్వబుగ్గ గురుకుల పాఠశాల(బాలురు) ప్రిన్సిపల్ పి ప్రసాద్‌రావు మంగళవారం నంద్యాల జిల్లా విద్యాధికారి డి జనార్ధన్‌రెడ్డి కలిసి విన్నవించారు. అలాగే ఏపి గురుకుల సంస్థ ప్రవేశ పరీక్ష క్యాలెండర్‌ను జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో విడుదల చేశారు.



## అన్న క్యాంటీన్ పరిశీలన



అన్న క్యాంటీన్‌ను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నిరుపేదల ఆకలితీర్చి పేద ప్రజలకు అండగా ఉండే అన్నా క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సముదాయంలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి ఆహార పదార్థాలు ఇస్తున్నారా లేదా ఉదయం అల్పాహారానికి ఎంతమంది వస్తున్నారు, మధ్యాహ్నం, రాత్రి భోజనాలకు ఎంతమంది పేదలు వస్తున్నారన్న విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నా క్యాంటీన్లలో రోజువారీగా నిర్ధేశించిన మెనూ ప్రకారం ఆహార పదార్థాలను ఇవ్వాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. అన్నా క్యాంటీన్ పరిసర ప్రాంతాలను కలెక్టర్ పరిశీలిస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఒక్కొక్కరి నుంచి పూటకు రూ.5లు చొప్పున నామమాత్రపుతధరను వసూలు చేసి ఆహార పదార్థాలను ఇస్తున్నామని సిబ్బంది కలెక్టర్‌కు నివేదించారు.

## 14వ వార్డులో పర్యటించిన ఎన్ఎండి.ఫిరోజ్



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వంలో నంద్యాల పట్టణం అభివృద్ధికి నోచుకోలేదని టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల 14వ వార్డు సరస్వతీ నగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు సమస్యలపై ఆరాతీశారు. ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధి కుంటుపడిందని ఎక్కడ చూసినా రోడ్లు, డ్రైనేజీ, నీరు, తదితర సమస్యలు ఉన్నాయని అన్నారు. ప్రజలు టీడీపీపై ఉన్న నమ్మకంతో పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించారని అన్నారు. ప్రజాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అహోబిలంలో.. స్వాతి వేడుకలు





**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన వేడుకలు అహోబిలం జనరల్ మేనేజర్ మురళీధరన్, జాబితా సభ్యులు వైకుంఠం, మనియార్ / అడ్మినిస్ట్రేట్ సుదర్శన్ ల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. నల్లమల అరణ్యంలో వెలసిన నవనరసింహులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామున నుండే నవనారసింహులను దర్శించు కునేందు కు కాలినడకన తరలి వెళ్లారు. జ్వాలా,అహోబిల, మాలోల క్రోడా, కారంజ భార్గవ, యోగానం ద, చిత్రపట,పావన నరసింహస్వాములను దర్శించుకున్నారు. కాలినడకన స్వామి దర్శించుకునే భక్తుల కోసం పావన, వరాహ, అహోబిల, యోగానంద తదితర క్షేత్రాలలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దిగువ అహోబిల అద్దాల మండపంలో ఉత్సవ మూర్తులైన శ్రీ ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఎదుట సుదర్శన హెూమం వేదమంత్రాలు మధ్య నిర్వహించారు. హెూమంలో పాల్గొన్న భక్తులందరికీ కాటుకను, హెూమరక్షలను అందజేశారు. ఈ స్వాతి వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వాతి సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు ఎగువ దిగువ అహోబిలాల్లో భక్తులు క్యూ లైన్లలో బారులు తీరారు.

# శ్రీశైల శ్రీ భ్రమరాంభికకు .. సారెతో

**నందవరం, మేజర్‌న్యూస్ :** ఉగాధి పర్వదిన పురస్కరించుకుని కర్నాటక ప్రాంతం వారు తమ ఆడపడుచు అయిన శ్రీశైలం శక్తి పీఠం అయిన శ్రీ బ్రమరాంభికాదేవికి సారెతో కన్నడీగులు కాలిబాటన విచ్చేస్తున్నారు.. ప్రతి ఏటా వారు వారి పంట పొలాలు నుండి దాన్యం ఇల్లు చేరాక కాలిబాటన వేల కి,మీ నడకతో శ్రీశైలం చేరుకుంటారు. వారు దారిలో నందవరం చేరుకున్నారు. కర్ణాటక రాష్ట్రం బెల్గాం, బాగల్‌కోట, గుల్బర్గా, తదితర ప్రాంతాల నుండి పయణం చేస్తూ వస్తున్నారు. తొలి అడుగులు మన రాష్ట్రంలోని నందవరంకు కన్నడీగుల అడుగులు మంగళవారం చేరుకున్నాయి. వారు ఇలా వారం రోజులపాటు మండల కేంద్రం నందవరం చేరేకుని అక్కడి నుండి కనకవీడు,



సారెతో విచ్చేసి సేద తీరుతున్న కన్నడీగులు

పొనకలదిన్నె మీదుగా వుళ్తుంటారు. వారికి ఎక్కడ అసౌకర్యాలు తావివ్వకుండా భక్తి శ్రద్దలతో వారు సేద తీర్చుకునే విదంగా విశ్రాంతి కేంద్రాలు, భోజన వసతులు , వైద్యసదుపాయాలు భక్తులే నిర్వహించడం జరుగుతుంది.. నందవరంలో శ్రీ మల్లికార్జున ఆలయం, బసవేవ్వర ఆలయ కమిటీల ఆద్వర్యంలో వారికి సేవ చేసుకుంటారు. అలాగే పొనకల దిన్నెలో రెడ్‌క్రాస్ సొసైటీ వారు వైద్యసేవలు ఏర్పాటు చేసి వైద్యసేవలు జరుగుతుంది.. వారం రోజుల పాటు ఎండలు అని చూడక వస్తున్న కన్నడీగుల కాలినడకకు తమకు తోచిన విదంగా తాగునీరు కేంద్రాలను , సలువ పందిళ్లను ర్పాటు చేసి శ్రీ మల్లికార్జున , బ్రమరాంభిక దేవిల కృపకు పాత్రులు అవుతున్నారు.

## ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ పోటీలు



**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** పట్టణంలోని అంబేద్కర్ గురుకులం బాలుర పాఠశాల మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్0-12 బాలబాలికల రగ్బీ పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమైయ్యాయని పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఏపి రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజినేయులు తెలిపారు. ఈ సందర్భంగా పోటీలను వారు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ పోటీలలో 11 పాఠశాలల జట్లు పాల్గొని, అతిథుల ముందు కవాతు చేశాయన్నారు. తమ పాఠశాలకు మైదానం ఉందని, విద్యార్థులను క్రీడల పట్ల ఉత్సాహం కల్పిస్తామని, అందు కొరకు పోటీల నిర్వహణ చేపట్టామన్నారు. 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో వారు మంచి గుర్తింపు పొందిన క్రీడాకారులుగా ప్రతిభను చాటుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పోటీల నిర్వహణలో రగ్బీ అసోసియేషన్ భాగస్వా ములైనందున సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రాఘవేంద్ర, మహబూబ్‌సుభాని, రాజేశ్వరి, రామమోహన్, నాగేశ్వరి, లావణ్య, చంద్రకళ, రమ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేను పగడ్బందీగా నిర్వహించాలి : తహశీల్దార్

**డోన్, మేజర్‌న్యూస్ః** మండల పరిధిలోని అన్ని గ్రామాలలో భూ రీసర్వేను పగడ్బందీగా నిర్వహించాలని తహశిల్దార్ నాగమణి అధికారులకు ఆదేశించారు. మంగళవారం స్థానిక తహశిల్దార్ కార్యాలయం నందు విఆర్ఓలు, సంబందిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వేలో ఎటువంటి తప్పులు లేకుండా రైతుల సహకారాలతో అధికారులు సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటి తహశిల్దార్ సునీల్‌కుమార్, మండల సర్వేయర్ జగదీష్, విఆర్ఓలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.



## వేసవిలో త్రాగునీటి సమస్య తల్లెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి – ఆదోని సబ్ కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

**ఆదోని, మేజర్ న్యూస్ :** వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపధ్యంలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఏలాంటి అంతరాయం కలుగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో తాగునీటి సరఫరా అంశాలపై ఎంపిడిఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, వేసవి కాలంలో తాగునీటి అవసరాలు పెరగనున్న దృష్ట్యా తగినన్ని చర్యలు ముందస్తుగా తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు తగినంత మోతాదులో తాగునీరు అందించేందుకు ప్రతి గ్రామంలో ఉన్న నీటి వన రులను పర్యవేక్షించాలన్నారు. చెరువులు, బోర్డు, ఓపెన్ వెల్స్, వాటర్ ట్యాంకులు వంటి నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అత్యావసర పరిస్థితుల్లో నీటి సరఫరా కొరత ఏర్పడితే తక్షణమే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, దీనికి అవసరమైన ప్రణాళికను అధికారులు సిద్దం చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి సమస్యపై పత్రికల్లో వచ్చిన ప్రకటనలను క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు తనిఖీ చేసి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పద్మజ, డివిజన్‌లోని ఎంపిడిఓలు, గ్రామీణ నీటి సరఫరా అధికారులు పాల్గొన్నారు.

# ఆదోనిలో 'డీ మార్ట్' స్టోర్ ప్రారంభం

- ఆదోనికి మంచిరోజులు వస్తున్నాయ్..
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులు విట్టా రమేష్



ఆదోనిలో డీ-మార్ట్ నూతన స్టోర్ ను ప్రారంభిస్తున్న విట్టా రమేష్

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** రిటైల్ రంగంలో తిరుగులేని ప్రఖ్యాత రిటైల్ స్టోర్ 'డీ-మార్ట్' నూతన బ్రాంచ్‌ను ఆదోని పట్టణంలో ప్రారంభించింది. ఈ మేరకు మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులు, ప్రముఖ వ్యాపారవేత్త విట్టా రమేష్ రిబ్బన్ కట్ చేసి స్టోర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విట్టా రమేష్ మాట్లాడుతూ..అత్యాధునిక డిజైన్లతో నమ్మకమైన సరసమైన ధరల్లో నాణ్యమైన ఉత్పత్తులు, వస్త్రాలు అలాగే మనిషికి కావాల్సిన నిత్యావసరాలన్నీ డీ-మార్ట్‌లోఅందుబాటులో ఉన్నాయని తెలిపారు. దీన్ని ఆదోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆదోనికి మంచి రోజులు వచ్చినట్లుగా తాను భావిస్తున్నట్టు తెలిపారు. మొన్న ఫైవ్ స్టార్ హోటల్, నిన్న శోభ కంచి శారీస్, చందన షాపింగ్ మాల్, నేడు డీ-మార్ట్ వంటివి రావడం వల్లన ఆదోనిలో ఎందరికో ఉపాధి దొరికిందన్న ఆనందాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరుకుంటున్నట్లుగా మన ఆదోని నిరుద్యోగ యువత కు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాలంటే ఆదోనిలో పరిశ్రమలు, కంపెనీలు, షాపింగ్ మాల్స్ వంటివి మరిన్ని రావాలని విట్టా రమేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీ-మార్ట్ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దగ్గుపాటి పర్యటనను విజయవంతం చేద్దాం.. భాజాపా పిలుపు



సమావేశంలో భాజాపా నాయకులు

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ఈ నెల 22వ తేదిన ఆలూరు నియోజకవర్గంలో పర్యటించనున్న భాజాపా రాష్ట్ర అధ్యక్షురాలు , రాజమండ్రి ఎంపి దగ్గుపాటి పురందేశ్వరి పర్యటనను విజయవంతం చేద్దాం అంటూ ఎమ్మిగనూరు భాజాపా నాయకులు టి నరసింహులు, జగ్గాపురం ఈరన్నలు భాజాపా నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యలయంలో ముఖ్య సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపధ్యంలో నియోజకవర్గంలో అన్ని మండలాలు నాయకులు గ్రామ స్థాయినుండి పార్టీ శ్రేణులను పెద్ద ఎత్తున తరలించి పర్యటన విజయవంతం చెయ్యాలన్నారు. భాజాపా నాయకులు, కార్యకర్తలు జట్టప్ప, వెంకటేష్, మునిస్వామిగౌడు, రాజశేఖర్ స్వామి, బడేసాబ్, చేనేత శివ, విజయకుమార్,గువ్వల నారాయణ పాల్గొన్నారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతిని అరికట్టండి


సబ్ కలెక్టర్‌కు విన తిపత్రాన్ని అందజేస్తున్న జనసేన నాయకులు

**ఆదోని, మేజర్ న్యూస్ :** సబ్ రిజిష్టర్ కార్యాలయంలో అవినీతిని అరికట్టాలని జనసేన మండల అధ్యక్షుడు తాహేర్ వలి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సబ్ రిజిష్టర్ కార్యాలయాన్ని జనసేనపార్టీ బృందం ముట్టడించారు. అమాయక ప్రజలకు జరుగుతున్న అన్యాయం పై సబ్ రిజిష్టర్ అరుణ్‌కుమార్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సబ్ రిజిష్టర్ కార్యాలయంలో అవినీతి మాత్రం రోజురోజుకు పెరిగిపోతుందని పేర్కొన్నారు. క్రయ విక్రయాలకు వస్తున్న ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా గ్రామ, వార్డు వారిగా మార్కెట్ ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. అధికారుల్లో మార్పురాకపోతే ఎమ్మెల్యే వచ్చాక కార్యాలయాన్ని కలిసి సందర్శిస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వారు సబ్ రిజిష్టర్‌కు అందజేశారు. జనసేన పార్టీ నాయకులు మహేష్ , బాష, కృష్ణారెడ్డి, రామిరెడ్డి, మంచాల రాజు, గోవిందు, శ్రీనివాసులు, నబీ రసూల్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు బెంచీలు ఏర్పాటు




**హొళగుంద,మేజర్‌న్యూస్‌:** హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఏ,బి సెంటర్లకు జిల్లా విద్యాశాఖాధికారి శ్యామూల్‌పాల్ ఆదేశాల మేరకు పదవ తరగతి విద్యార్థులు పరీక్షలను రాసేందుకు మంగళవారం బెంచీలను ఏర్పాటు చేశారు. 17వ తేదిన ప్రారంభమైన పరీక్షలకు ఆ రెండు సెంటర్లకు బెంచీలు లేకపోవడంతో విద్యార్థులు నేలపై కూర్చుని పరీక్షలను రాసే పరిస్థితి ఏర్పడడంతో ఆ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారికి విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడం కాకుండా ఆ సమస్య సోషియల్ మీడియాల్లో వైరల్ కావడంతో జిల్లా కలెక్టర్ రంజింత్‌బాష దృష్టికి కూడా వెళ్లిన విషయం పాఠకులకు విధితమే. సిరియస్ అయిన కలెక్టర్ ఇద్దరి చీఫ్ సూపరింటెండెంట్లను విధుల నుండి తొలగిస్తూ ఆర్‌జేడికి సరెండర్ చేశారు. వారి స్థానంలో ఏ సెంటర్‌కు మల్లికార్జునగౌడ,బి సెంటర్‌కు ఉసేనిలను చీఫ్ సూపరింటెండెంట్లుగా నియమించారు. వారి సమక్షంలో స్థానిక ప్రవేట్ పాఠశాలల ద్వార బెంచీలను తెప్పించి పాఠశాల గదులో ఏర్పాటు చేశారు. బుధవారం జరిగే పరీక్షలకు విద్యార్థులకు బెంచీల సౌకర్యం కల్పించామని విద్యాశాఖాధికారులు చెప్పారు. పకడ్బందీగా పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు.

# ఆటో,మోటర్ సైకిల్ ఢీ

- వ్యక్తికీ తీవ్ర గాయాలు

**చాగలమర్రి , మేజర్ న్యూస్ :** చాగలమర్రి నుండి నారాయణపల్లె రహదారిలో బుగ్గవంక సమీపంలో ఆటో,మోటర్ సైకిల్ డీకొన్న సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కడప జిల్లా నారాయణపల్లెకు చెందిన నరసింహులు చాగలమర్రి నుండి నారాయణపల్లెకు మోటర్ సైకిల్ పై వెలుతుండగా చాగలమర్రి వైపు వస్తున్న మినరల్ వాటర్ సరఫరా చేస్తున్న ఆటో బుగ్గ వంక సమీపంలో ఎదురుగా వస్తున్న మోటర్ సైకిల్ ను డీ కొంది. ఈ ప్రమాదంలో నరసింహులు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ నరసింహులును కేరళ వైద్యశాలకు తరలించారు. కాలుకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన చికిత్సకై కడప వైద్యశాల కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేరళ వైద్యశాలకు చేరుకుని విచారణ చేపట్టారు.

# వ్యవసాయ పరికరాల కొరకు దరఖాస్తు చేసుకోండి

**అవుకుమేజర్,న్యూస్‌:** అవుకు మండల వ్యవసాయ అధికారి వి. అబ్దుల్ హక్ అవుకు మండలంలోని నిచ్చెనమెట్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణలో బాగంగా రైతుల ఆధునిక వ్యవసాయ పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి. అబ్దుల్ హక్ తెలిపారు. అలాగే బ్యాటరీ స్ప్రేయర్లు, ట్రాక్టర్ దుక్కు, దమ్ముసెట్లు, రోటోవేటర్లు, పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లను 50శాతం సబ్సీడితో అందించనున్నట్లు తెలిపారు. 2024 -2025 సంవత్సరానికి గాను రైతులకు 50శాతం సబ్సీడిపై వ్యవసాయ పరికరాలను సరఫరా చేసేందుకు నిధులు మంజూరైనట్లు జిల్లా నుండి రైతు సేవ కేంద్రాల వరకు వ్యవసాయ పనిముట్లు టార్గెట్ ఇవ్వడమైనదని తెలిపారు. గత ఐదేళ్లు గా వ్యవసాయశాఖ నుంచి సబ్సీడి ద్వార పరికరాలు పొందని సన్న, చిన్నకా రు రైతులు అర్హులన్నారు. ఎపీ ఆగ్రోస్ ద్వార వివిధ కంపెనీల నుండి వ్యవసా య యంత్రాలు పనిముట్లు రైతులకు సప్లై చేస్తున్నారన్నారు. ఆసక్తి గల రైతు లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరింత సమాచారం కొరకు స్థానిక రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

# సరైన సమయానికి ఆరోగ్య సేవలందించండి

సిబ్బందికి సూచలనిస్తున్న ఎనోచ్‌ఎఐ పీడీ అశోక్ కుమార్




**చాగలమర్రి , మేజర్ న్యూస్:** జాతీయ రహదారిపై ఏదైనా రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు సరైన సమయానికి ఆరోగ్య, వైద్య సేవలు అందించాలని నేషనల్ హైవే పీడీ అశోక్ కుమార్ తెలియజేశారు. మంగళవారం చాగలమర్రి పట్టణ సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఎన్ హెచ్ ఏ ఐ, హెచ్ ఎల్ ఎల్ లైఫ్ కేర్ వారు సంయుక్తంగా టోల్‌ప్లాజా సిబ్బంది, ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ సిబ్బందికి శిక్షణా తరగతులను మంగళవారం నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులను పిడి, హెచ్‌ఎల్‌ఎల్ స్టేట్ కోఆర్డినేటర్ మహేష్ కుమార్ పర్యవేక్షించారు. ఈ నందర్భంగా పీడీ మాట్లాడుతూ జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు అందించాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రమాద స్థాయిని తగ్గించాలని తెలిపారు. సీపీఆర్ చేయడం నేర్చుకోవడం వల్ల చాలా ఉపయోగంగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో రాయలసీమ ఎక్స్ప్రెస్ హైవే ప్రాజెక్టు హెడ్ మదన్మోహన్, అరుణ్ రాజ్, సంతోష్, బాష, మనోహర్రెడ్డి పాల్గొన్నారు.

# మహిళలకు టైలరింగులో శిక్షణ తరగతులకు ఆహ్వానం


సి.బెళగల్ మండల ఎంపీడీఓ. రాణెమ్మ

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** మండలంలోని వెనకబడిన తరగతుల బిసి,ఇబిసి,కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ వర్గాలకు చెందిన మహిళలకు టైలరింగులో శిక్షణ తరగతులకు దరఖాస్తులను కోరింది. ఇందుకు టైలరింగు నందు ఆసక్తి గల 18 నుండి 50 సంవత్సరాలలోపు మహిళలు గ్రామ సచివాలయం నందు ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలని, నమోదు చేసున్న వారికీ జిల్లా వెనకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించి శిక్షణ అనంతరం కుట్టు మిషన్ అందింస్తారని, మహిళలు సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు.

# గ్రంథాలయానికి ఎంబిబిఎస్ పుస్తకాలు వితరణ



పుస్తకాలను బహుకరిస్తున్న దృశ్యం

**బనగానపల్లె,మేజర్‌న్యూస్ :** బనగానపల్లె శాఖ గ్రంథాలయంనకు విశ్రాంత ఉపాధ్యాయులు కె. సురేష్‌కుమార్ రెడ్డి దాదాపు రూ. 15వేల రూపాయల ఖరీదు చేసే ఎం.బి.బి.ఎస్ మరియు మెడిసిన్ , పి.జి పుస్తకాలను గ్రంథాలయానికి బహుకరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్ వారిని అభినందించారు. ఎవరైనా మెడిసిన్ చదివే విద్యార్థులు ఈ పుస్తకాలను వినియోగించుకోవాలని తెలియజేశారు. అలాగే రాబోయే వేసవిలో తమ పిల్లలను తల్లిదండ్రులు వేసవి సెలవులను గ్రంథాలయాల్లో సందర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాలయంలో శాస్వత సభ్యత్వం రూ. 100 లు తమ పిల్లల పేరిట కట్టి పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదువుకొనేలా చూడాలన్నారు. రాబోయే పోటీ పరీక్షలకు సంబంధించి మెటీరియల్ కొనుగోలుకు పిల్లల భవిష్యత్తు కొరకు దాతలు ముందుకు రావాలని గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్ కోరారు.

# ఈ నెల 19 నుంచి ఆధార్ అప్డేట్ క్యాంపులు

**బనగానపల్లె,మేజర్‌న్యూస్ :** ఈ నెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మరియు 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు 8రోజులపాటు ఆధార్ అప్టేడ్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు బనగానపల్లె ఎంపిడిఓ రమణ తెలిపారు. ఇల్లూరు కొత్తపేట, బనగానపల్లె సెక్రెటరియోట్ 4, పంచాయితీ ఆఫీస్, బనగానపల్లె సెక్రెటేరియట్ 2, పసుపల, పాతపాడు, పలుకూరు, గ్రామ సచివాలయాల్లో ఈ ఆధార్ అప్డేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బనగానపల్లె ఎంపిడిఓ తెలిపారు.

# ఈ నెల 30వ తేదీ నుండి అమ్మవారి జ్యోతి మహోత్సవాలు


అమ్మవారి ఫైల్ ఫోటో

**బనగానపల్లెరూరల్,మేజర్‌న్యూస్ :** నందవరం శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి రాయబారాది జ్యోతి రథ వసంతోత్సవాలు ఈ నెల 30వ తేదీ నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కామేశ్వరమ్మ తెలిపారు. 30వ తేదీ ఆదివారంనాడు గణపతి పూజ పుణ్యాహ వాచనం అనంతరం అంకురార్పన పంచాగశ్రవణం, పన్నెరపు బండ్లు తిప్పుట, ప్రాకర రథోత్సవం కార్యక్రమాలు 31వ తేదీ సోమవారంనాడు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కళ్యాణోత్సవం రాత్రి 10గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏప్రిల్ 1వ తేదీన మంగళవారం అమ్మవారికి కుంకుమార్చన, సాయంకాలం అమ్మవారి రాయబారాది మహోత్సవం, రాత్రి 10గంటలకు పౌరానిక నాటక ప్రదర్శణ 2వ తేదీ బుధవారంనాడు అమ్మవారికి సహస్త్రనామ కుంకుమార్చన, పసుపుకుంకుమ, పట్టువస్త్రాల అలంకరణ, సాయంత్రం అన్నమయ్య సంకీర్తన కార్యక్రమాలు రాత్రి 12గంటల నుండి శ్రీ భాస్కరయ్య ఆచారిచే అమ్మవారికి దిష్టిచుక్క పెట్టుట, శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి మహోత్సవం, 3వ తేదీ గురువారం అమ్మవారి రథోత్సవం (పోవడం) 4వ తేదీ శుక్రవారంనాడు అమ్మవారి రథోత్సవం (రావడం) 5వ తేదీ శనివారంనాడు వసంతోత్సవ కార్యక్రమాలతో అమ్మవారి జ్యోతి మహోత్సవ వేడుకలు ముగుస్తాయని ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ఈ.ఓ తెలిపారు.

# ఏజిపిగా కమతం బాల గుర్రెడ్డి నియామకం



ఏజిపి కమతం బాల గురెడ్డి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డసీనియర్ మరియు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్( ఏజిపి) గా సిరివెళ్ల మండలం,ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన న్యాయవాది కమతంబాల గుర్రెడ్డి ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈయన గత 20 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో ఉన్నారు. ఏజిపిగా ఈయన నియామకం పట్ల ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమతం బాల గుర్రెడ్డి మాట్లాడుతూనా మీద నమ్మకంతోఏజిపిగా నియామకానికి సహకరించిన ఆళ్లగడ్డ శాసన సభ్యులు భూమా అఖిలప్రియకి, తెదేపా సీనియర్ నాయకుడు భార్గవ్ రామ్ భూమా జగత్ విక్యాత్ రెడ్డి లకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అమ్మవారికి వెండి త్రిశూలం బహూకరణ



**గడివేముల మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన గడివేములలో వెలసిన శ్రీ మూల పెద్దమ్మ అమ్మవారికి రూ 70,000 విలువ చేసే వెండి త్రిశూలాన్ని గడివేముల కు చెందిన బండల దుకాణం యజమాని దేవ మాడ ఎల్లనాగన్న,భూలక్ష్మీ దంపతులు బహుకరించినట్లు ఆలయ ఈవో రామలింగారెడ్డి తెలిపారు. మిడుతూరు మండలం పీరు సాహెబ్ పేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కీర్తిశేషులు దేవమడ లక్ష్మన్న కుమారుడైన ఎల్ల నాగన్న, భూలక్ష్మి దంపతులు అమ్మవారి కి రూ 70 వేల విలువచేసే వెండి త్రిశూలం బహుకరించి మొక్కు తీర్చుకున్న అనంతరం ఆలయ నూతన కమిటీ చైర్మన్ దేశం రమణారెడ్డి,నరేంద్ర రెడ్డిలు మరియు ఆలయ కార్యనిర్వణాధికారి రామలింగారెడ్డి ఆలయ సిబ్బంది రామ సుబ్బయ్యలు అమ్మవారికి వెండి త్రిశూలానికి బహుకరించిన బండల డిపో నాగన్న దంపతులకు శాలువా కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో శ్రీ మూల పెద్దమ్మ ఆలయ కమిటీ చైర్మన్ దేశం రమణారెడ్డి,దేశం నరేంద్ర రెడ్డి,మిడుతూరు మండల మాజీ జడ్పిటిసి సభ్యులు దేవమడ జయమ్మ,టిడిపి బీసీ సంఘం నాయకులు దేవామడ జయరాముడు,పెద్ద నాగస్వామి మరియు కుటుంబ సభ్యుల తోపాటు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# సర్వేలు వేగవంతం చేయండి- డిఎల్‌డీఓ శివారెడ్డి



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**చాగలమర్రి , మేజర్ న్యూస్:** పూర్తి పేదరిక నిర్మూలనే లక్ష్యంగా గ్రామాలలో, వార్డు సచివాలయ సిబ్బందిచే పట్టిన పి4 సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని డిఎల్‌డీఓ,గ్రామ,వార్డు సచివాలయాల జిల్లా అధికారి శివారెడ్డికోరారు.మంగళవారం చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో చాగలమర్రి పట్టణంలోని సచివాలయాల వివిధసర్వేలకు సంబంధించిన ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4,వర్క్ ఫ్రమ్‌హెూమ్, మిస్సింగ్ సిటిజన్ సర్వేలను,చిన్నారుల ఆధార్‌ల ఈకేవైసి సర్వేలను త్వరగా పూర్తి చేయాలన్నారు.ఈ సర్వేలలో ఏమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఈఓపిఆర్‌డి తాహీర్‌హుసేన్, పంచాయతి కార్యదర్సులు,సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# సారా మహమ్మారిని తరిమేద్దాం

**కోడుమూరు ఎక్సైజ్ ఎస్సై ఎం.మంజుల**




ప్రచార రథం ద్వారా అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** కుటుంబాలను నడిరోడ్డున పడవేసి, జీవితాలను చిన్నాభిన్నం చేసే సారా మహమ్మారిని తరిమేద్దామని కోడుమూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్సై ఎం.మంజుల పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్.బండతాండ, పుల్లగుమ్మి, రామళ్ళకోట, కలుగొట్ల, బుక్కాపురం, పిక్కినివానిపల్లె గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా నవోదయం ప్రచార రథం ద్వారా గ్రామాలలో ప్రజలకు నాటుసారా ద్వారా కలిగే నష్టాలను వివరిస్తూ, అవగాహన కల్పించి ప్రచారం నిర్వహించారు.

# విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు శిక్షణ కేంద్రం ఏర్పాటు



శిక్షణ ఇస్తున్న దృశ్యం

**బనగానపల్లె,మేజర్‌న్యూస్ :** బనగానపల్లె భారతీయ జనతాపార్టీ కార్యాలయం నందు విశ్వకర్మ యోజన లబ్దిదారులకు శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి భారతీయ జనతాపార్టీ కన్వీనర్ బి.వి సుబ్బారెడ్డి అర్బన్ మండల అద్యక్షుడు యాదగిరి, రూరల్ మండల అద్యక్షుడు హరికృష్ణ గౌడ్, జిల్లా మాజీ ఎస్.సి మౌర్చా అద్యక్షుడు తప్పెట ప్రసాద్, ఉప్పరి వెంకటనారాయణ, బనగానపల్లె మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, కిశోర్ మోక్ష జిల్లా ఉపాధ్యక్షులు శివరామిరెడ్డి, లింగన్న, లబ్ధిదారులు భారతీయ జనతాపార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ.8కోట్ల 16లక్షల పనులకు వ్యయం

**రూ3.15 లక్షల అవినీతి జరిగిందంటూ వెల్లడి..రికవరీ రూ.93వేలు**

**మండలంలోమొత్తం పనులు 717**




**పెద్దకడుబూరు,మేజర్ న్యూస్:** పెద్దకడుబూరుమండలంలో 1,4.2023 నుండి31,3,2024అలాగే 24,2,2025వ సంవత్సరం వరకు జరిగిన ఉపాధి పనులు పై17వ ఉపాధి హామీ పథకం సామాజిక కార్యక్రమాన్ని మండల కేంద్రమ్కైన పెద్దకడుబూరు గ్రామంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయం అవరణంలో మంగళవారం ఎస్ ఆర్ పి.బాస్కర్ అధ్వర్యంలో జరిగింది. ముందుగా తారాపురం గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధి పనుల్లోమష్టర్లో కొంత మంది ఉపా ధి కూలీలు దూర ప్రాంతాలకు వలస వెళ్లిన కూలీలను కూడా పనులకు హాజరైనట్లు మమేటీలు పేర్లు నమోదు చేసుకొని ఉపాధి సోమ్ము కాజేసినట్లు. అలాగే రంగాపురం గ్రామంలో ఆషావర్కర్ ఉపాధి పనులకు వెళ్లి సూమారుగా రూ9.500లు అమె నుండి రికవరీ చేయాలని సంబంధిత ద్వామాపిడి వెంకట రమణ ఆదేశించారు.అధేవిధంగా మండలంలో 717ఉపాధిపనులకు సూమారుగా రూ8కోట్ల16 లక్షలు రూపాయలు వ్యయం చేసినట్లు అయన తెలిపారు. అలాగే రూ3,15 లక్షలు మేరకు అవినీతి జరిగిందన్నారు. సామాజిక తనిఖీ లో సరియైన పత్రాలు ఆధారాలు చూపించని తప్పు చేసిన వారికి రూ93వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగునే వివిధ గ్రామాలలో పలువురు క్షేత్ర సహాయ కులు అవినీతి అక్రమాలకు పాల్పడిన వారు అతి తక్కువుగా చేశారని అధికారులు చూపించడం విస్మయం కలిగించింది. అయితే ఇటీవల ప్రభుత్వం మారడంతో చాలా గ్రామాల్లో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేశారు.పి. డి.వెంకటరమణయ్య. అడిషనల్ పి.డి. మాధవిలత.డి.వి.ఓలోకేశ్వర్. ఆదినారాయణ. ఎంపిడిఓ నాగరాజు స్వామి. మండల పిఆర్ ఎఈమల్లయ్య. మండలఎపిఓ చంద్రశేఖర. ఖాదర్ బాషా. ఉపాధి సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల అభ్యున్నతి సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

**నేతన్నల తరపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు**



మాట్లాడుతున్న చేనేత టీడీపి నాయకులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** చేనేత కార్మికుల అభ్యున్నతి కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అని, చేనేత కార్మికుల కోసం 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రకటించడం ఎంతో సంతోషకరమని టీడీపి చేనేత నాయకులు పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఆర్థిక భారం తగ్గించడంతోపాటు, చేనేత రంగ అభివృద్ధికి చెందుతుందన్నారు. చేనేత కార్మిక సంఘాల ప్రతినిధులు, గ్రామస్థాయి కార్మికులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. విద్యుత్ వ్యయాన్ని తగ్గించడం వల్ల మేము మా ఉత్పత్తిని మరింత మెరుగుపరుచుకోవచ్చని, దీని ద్వారా మా జీవనోపాధికి కొత్త ఊపొస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా, ముఖ్యమంత్రికి, సంబంధిత మంత్రిత్వ శాఖలకు, ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయానికి చేనేత కార్మికుల తరుపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. భవిష్యత్తులో కూడా ఇలాంటి నిర్ణయాలు తీసుకుని చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. చేనేత టీడీపి నాయకులు బండా నర్సప్ప, దామా నరసింహులు, కామార్తి మిన్నప్ప, కామార్తి మహేష్, దేవేంద్ర, భీమేష్ పాల్గొన్నారు.

# రీసర్వే పనులను తనిఖీ చేసిన జిల్లా అధికారులు



ప్రతేక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** మండలంలో జరుగుతున్న రెండవ దఫా భూ రీసర్వే పనులను మంగళవారం జిల్లా అధికారులు తనిఖీ చేశారు. గత ప్రభుత్వం తీసుకవచ్చిన భూరీ సర్వే లో భాగంగా మండలంలో రెండు గ్రామాలు మినహా మిగతా గ్రామాలలో రీ సర్వే పనులు గతంలోనే నిర్వహించారు. మిగిలిన సి.బెళగల్, బ్రాహ్మణదొడ్డి గ్రామాలలో రీ సర్వే పనులు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నారు. అందుకు గతంలో జసరిగిన పొరపాట్లను దృష్టిలోవుంచుకొని పథకం ప్రకారం రీ సర్వే పనులు మొదలుపెట్టారు. ఇందుకు విఆర్ఓ,విఆర్ఏ,విఎస్ లను ఒక్క టీం చేసి ఇలా మొత్తం ఆరు టీంలను ఏర్పాటు చేసి వారిని షిఫ్టల వారిగా సర్వే పనులను నిర్వాహిస్తున్నారు. రీ సర్వే సమయంలో చుట్టూ పక్కల రైతుల అనుమతితో సర్వే పనులు నిర్వహించే విధంగా మండల రీ సర్వే డిటీ, మండల సర్వేయర్‌ల ఎప్పటిక్కపుడు సలహాలు సూచనలు అందించారు. మంగళవారం జిల్లా సహాయ సంచాలకులు మునికన్నన్, డిఐఓఎస్ సుబ్బారెడ్డి మండలంలో నిర్వహిస్తున్న రీ సర్వే పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతేక సమావేశంలో జిల్లా అధికారులు మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను త్వరగతిన పూర్తిచేయాలనీ అందుకు ఏప్రిల్ 14 కల్ల పూర్తి చేయాలన్నారు. రీ సర్వేలో తలేత్తే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే సమయంలో ఒక్కరోజు ముందుగానే సంబంధిత రైతులకు చుట్టూ చెక్ బంది రైతులకు సమాచారం తప్పక అందిచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ సంచాలకులు మునికన్నన్,డిఐఓఎస్ సుబ్బారెడ్డి, మండల రీ సర్వే డిటీ. వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం, వీలేజ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు సహకారం వల్లే ఎస్సీ వర్గీకరణ సాకారం..

**ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనంద్ చైతన్య మాదిగ**

**ఎమ్మిగనూరు అర్బన్, మేజర్ న్యూస్:** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాల పోరాటాల తర్వాత న్యాయం గెలిచింది. ఇందుకు అన్నివిధాలా సహకరించిన చంద్రబాబు నాయుడే ప్రధాన కారణం' అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు గంజహల్లి మహదేవ్ మాదిగలు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలో స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు ఏర్పాటైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఏక సభ్య కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను సోమవారం రోజున సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఎమ్మిగనూరు నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగిన ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి అండగా నిలబడడమే కాకుండా ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. తక్షణమే వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వర్గీకరణను అమలు చేసి ఎస్సీ 59 ఉప కులాలకు విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించి సామాజిక న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబుకు మాదిగలు ఎల్లవేళలా రుణపడి ఉంటారని చెప్పారు. వర్గీకరణ చేసేలా చొరవ చూపిన చంద్రబాబుకు ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలియజేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు.

# మహానంది క్షేత్రంలో పెను విషాధం

- ఇద్దరు మృతి
- నాగనంది సదనం కూల్చుతుండగా ప్రమాదం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, ఆలయ అధికారులు





**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్య క్షేత్రంలో పెను విషాధం చోటు చేసుకుంది. మంగళవారం నాగనంది సదనం పాత గదులను కూలుస్తుండగా ఒక్కసారిగా స్లాప్ కూలడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం సాయంకాలం సమయంలో నాగనంది సదనం క్రేన్‌తో కూలుస్తుండగా ప్రకంపనలకు గురైన మరో గోడ కూలడంతో ఆ గోడ కింద ఉన్న పెద్దకొట్టాల గ్రామానికి చెందిన గుత్తి వెంకట రమణ (65) అక్కడికక్కడే మృతి చెందగా వెంకటేశ్వర్లు (62) తీవ్రగాయాల పాలవడంతో నంద్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు మహానంది ఎస్సై రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఘటనా స్థలాన్ని ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ మధులు పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. మహానంది ఎస్సై రామ్మోహన్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మృతుల కుటుంబాలకు సంపూర్ణ సహకారం అందిస్తాం

**– కెసి కెనాల్ ఛైర్మెన్ బన్నూరు రామలింగా రెడ్డి**



**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్యక్షేత్రంలో జరిగిన సంఘటనపై వెంటనే గ్రామానికి చేరుకున్న కెసి కెనాల్ ఛైర్మెన్ బన్నూరు రామలింగా రెడ్డి మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మంగళవారం సాయంకాలం క్షేత్రానికి చేరుకున్న ఆయన అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాద సంఘటనను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వీరి వెంట నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి, శ్యామల జనార్ధన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# ఈవీఎం గోడౌన్ల పరిశీలన



ఈవీఎంల గోడౌన్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ రాజకుమారి పర్యవేక్షించారు. మంగళవారం టెక్కె మార్కెట్ యార్డులోని ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్లకు వేసిన సీళ్ళను, ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టర్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈవీఎంల గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పలు సూచనలు చేశారు. డీఆర్వో రామునాయక్, ఆర్డీవో విశ్వనాథ్, నంద్యాల తహశీల్దార్ ప్రియదర్శిని, ఎన్నికల విభాగపు తహశీల్దార్ జయప్రసాద్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులైన కాంగ్రెస్ తరపున సయ్యద్ రియాజ్ బాషా, వైయస్సార్ సీపీ తరపపున సాయిరాంరెడ్డి, టీడీపీ తరపున శివరామిరెడ్డి, బీజేపీ తరపున కశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ప్రజలు ప్రశాంతంగా జీవించాలి : డిఎస్పీ ప్రమోద్

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఫ్యాక్షన్ గొడవలకు దూరంగా ఉండాలి



**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** ప్రశాంతమైన గ్రామాల్లో ప్రజలు ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్ సూచించారు. మంగళవారం మండలంలోని భీమునిపాడు గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిఎస్పీ ప్రమోద్ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో వర్గ విబేధాలు విడనాడి అందరు కలిసిమెలిసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. సమస్యలు ఉంటే వెంటనే పోలీసు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, జూదం, నాటుసారా, తదితర వాటికి దూరంగా ఉండాలని అన్నారు. ఎవరైనా వీటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామాల్లో సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వేసవి కాలం వచ్చిందని ప్రజలు ఆరుబయట నిద్రపోయే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. దొంగతనాలు జరిగే ప్రమాదం ఉందని బయట పడుకునే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గ్రామాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని సిఐ, ఎస్సైలకు సూచించారు. గ్రామంలో గొడవలు, తదితర వాటిపై డిఎస్పీ ఆరాతీశారు. గతంలో ఇక్కడ ఫ్యాక్షన్ హత్యలు జరిగాయని మళ్లీ అలాంటివి జరుగకుండా పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోవెలకుంట్ల సిఐ హనుమంతు నాయక్, ఎస్సై మల్లికార్జున్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీఘణ మద్దులేటి లక్ష్మీ నరసింహస్వామి స్వాతి నక్షత్ర పూజలు



**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**నంద్యాల పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలి : జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా పోలీసులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం కర్నూలు పోలీసులు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించి అనుమానితులను విచారించారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారు డ్రైవర్లు సీటు బెల్టు వేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి : జిల్లా జడ్జి కబర్ధి





**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు కబర్ధి, కార్యదర్శి లీలా వెంకట శేషాద్రిలు అన్నారు. మంగళవారం నగరంలోని పురుషుల,మహిళల కారాగారములు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి కబర్ధి జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేసి జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్,ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని వారు ఖైదీలకు న్యాయ సలహాలు,సహాయాలు అందిస్తారని తెలిపారు. ఖైదీలకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. అలాగే ఖైదీలకు అందించే ఆహారాన్ని, రేషన్‌ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలు పరిశీలించారు. ఖైదీలను కోర్టు వాయిదాలకు కచ్చితంగా హాజరు చేయాలని ఆదేశించారు. కొందరు ఖైదీలు బెయిల్ మంజూరైనా జామీనుదారులు లేక జైలులో ఉన్నామని జిల్లా జడ్జికి తెలుపగా వారి కేసులను విచారించి బెయిల్ మంజూరు కొరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు,లాయర్ శివరాం,ఖైదీలు పాల్గొన్నారు.

# గ్రామాలను సందర్శించిన ఆదోని సబ్ కలెక్టర్



నెరణికిలో వివాదస్పదంగా ఉన్న బంక్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** హొళ గుంద మండలం పెద్దహ్యాట, నెరణికి,లింగంపల్లి గ్రామాలను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భర ద్వాజ్ మంగళవారం సందర్శించారు. పెద్దహ్యాట గ్రామంలో రీసర్వే పై,నెరణికిలోని ఆంజనేయస్వామి దేవాలయం పక్కన వివాదస్ప దంగా మారిన బంక్‌ను పరిశీలించాడు. బంక్‌ను పెట్టుకున్న నిర్వహకుడు కోర్టుకు వెళ్ళాడు. బంక్‌ను తొలగించాలని గ్రామస్తులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో గ్రామంలో విచారణ చేశారు. ఆదేవిధంగా లింగంపల్లి గ్రామంలో భూమి విషయంపై విచారణ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహశీల్దార్ నీజాముద్దీన్,ఆర్ఐ ముకుందరావు,విఆర్ఒలు ప్రహ్లాద్,దామోధర్, లక్ష్మినారా యణరెడ్డి, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

# పిల్లల ఆధార్ నమోదును పూర్తి చేయాలి

## – జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** 0–5సం॥లలోపు పిల్లల ఆధార్ వివరాల నమోదును పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌భాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆధార్ ఎన్రోల్‌మెంట్,ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 0నుండి 5సం॥ల వయసు గల పిల్లల ఆధార్ నమోదులో జిల్లా వెనుకబడి ఉందన్నారు. జిల్లాలో 106 ఆధార్ కేంద్రాలు ఉన్నాయని రోజుకు 20చొప్పున నెలలోపు ఆధార్ ఎన్రోల్‌మెంట్‌ను పూర్తి చేయాలని జడ్‌పి సిఈఓ, ఐసిడిఎస్ పిడిలను ఆదేశించారు. సబ్ కలెక్టర్, ఆర్డీఓలు కూడా ఈ అంశంపై శ్రద్ద తీసుకోవాలన్నారు. ఆధార్ నమోదుతో పాటు బర్త్ సర్టిఫికేట్ లేని వాళ్లకు బర్త్ సర్టిఫికేట్ ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా డివిజన్‌లలో తహశీల్దార్లు, సిడిపిఓలు,సూపర్‌వైజర్లు తదితరులతో నేడు వెంటనే సమావేశం ఏర్పాటు చేసి ఆధార్ నమోదు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్డీఓలను ఆదేశించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఐదేళ్ల తర్వాత ఆధార్ అప్‌డేషన్, 15నుండి 17సం॥ల మధ్య కూడా మరొకసారి అప్‌డేషన్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా పరిషత్ సిఈఓ నాసరరెడ్డి, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల, డిఈఓ శ్యామూల్‌పాల్,కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డిఎల్‌డిఓ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆదోని సబ్ కలెక్టర్,పత్తికొండ ఆర్డీఓ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.